పండుగలా వ్యవసాయం

- ఆర్బీకేలతో రైతులకు ప్రయోజనం
- నాడు క్రాప్ హాలిడే.. నేడు ఆ మాటే లేదు..
- వత్సవాయిలో 27,586 ఎకరాల సాగుభూమి

దేశ సమగ్రాభివృద్ధిలో విడదీయరాని భాగం వ్యవసాయానిది. దీన్ని నాటి టీడీపీ ప్రభుత్వం దండగ అంటే.. నేడు రాష్ట్రంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వ్యవసాయాన్ని పండుగ చేస్తోంది. అప్పటి టీడీపీ పాలకుల కుటిల నీతికి చరమగీతం పాడుతూ అన్నదాతల చెంతకే పథకాలను చేరుస్తున్నారు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. రైతులకు అందుబాటులో ఉండటానికి గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటుచేసి విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు వంటివి అందజేస్తున్నారు. పల్లె ప్రగతికి పట్టం కడుతూ రైతు సంక్షేమమే లక్ష్యంగా పథకాలను అమలుచేస్తుండటంతో రైతులు ఆనందంగా గడుపుతున్నారు.

వత్సవాయి: నాటి టీడీపీ ప్రభుత్వం అజమాయిషీ ఆంధ్రప్రదేశ్‌లో లేకపోవడంతో నకిలీ విత్తనాలతో రైతులు తీవ్రగా నష్టపోయేవారు. అడపా దడపా పండిన పంటకు సరైన ధర లభించక రైతులు ఇక్కట్లు పడేవారు. పెట్టుబడి సాయం వంటివి కూడా ప్రభుత్వం నుంచి అందకపోవడంతో రైతులు ప్రైవేటు వ్యాపారుల వద్దకు వెళ్లి అధిక వడ్డీలకు డబ్బులు తీసుకుని పంటలను సాగుచేసుకునే వారు. దీనికితోడు నాటి టీడీపీ పాలకులు వ్యవసాయం దండగ అంటూ ఈ రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారు.

నేడు ఆ పరిస్థితుల్లేవు

నేడు రాష్ట్రంలో అలాంటి ఇబ్బందికర పరిస్థితులే లేవు. ఏపీలో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయ రంగంపై ప్రత్యేక శ్రద్ధ చూపి పండగలా మార్చారు. రైతుల కోసం గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటుచేశారు. వీటి ద్వారా విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు వంటివి రైతులకు చేరవయ్యాయి. ఆర్బీకేల ద్వారా పండిన పంటను కొనుగోలు చేయడం.. ఆ పంటకు నగదును రైతు ఖాతాల్లో జమచేస్తున్నారు.

మండలంలో 27,586 ఎకరాల సాగుభూమి

మండలంలో 27,586 ఎకరాల సాగు భూమి ఉంది. ఇక్కడ 9,480 మంది రైతులు వ్యవసాయం చేస్తున్నారు. పత్తి 9,100 ఎకరాలు, మిర్చి 11 వేల ఎకరాలు, వరి 4,600, రబీలో మొక్కజొన్నను 3,600 ఎకరాల్లో సాగు చేస్తున్నారు.

మండలంలో 19 ఆర్బీకేలు

మండలంలో మొత్తం 19 ఆర్బీకేలు ఉన్నాయి. వాటి ద్వారా రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు 2,240 క్వింటాళ్లు, వరి, పత్తి, మిర్చి, మొక్కజొన్న విత్తనాలు 1000 క్వింటాళ్లు, ఎరువులు 4,200 మెట్రిక్ టన్నులు, అందించారు. రైతుభరోసా ద్వారా 8,574 మంది రైతులకు రూ 6. 43 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేశారు. మిర్చి పంటకు క్రాప్ ఇన్సూరెన్స్ ద్వారా ఎకరాకు రూ.48, 300 చొప్పున 2605 మంది రైతులకు రూ 25,66,65,38 అందించారు.

సబ్సిడీపై విత్తనాలు

పచ్చిరొట్ట విత్తనాలు జీలుగుల, పిల్లపెసలు, పెసలు వంటివి సబ్సిడీపై రైతులకు అందిస్తున్నారు. రైతులకు కావల్సిన యంత్రపరికరాలు తైవాన్ పంపులు, ఆయిలింజన్లు, టార్పాలిన్ పట్టాలు, ట్రాక్టర్లు వంటి పరికరాలను సబ్సిడీపై అందజేస్తున్నారు. రైతులకు పెట్టుబడి సాయంగా రైతుభరోసాతో రైతుల ఖాతాల్లో నగదు జమచేయడంతో వారు సంతోషంగా ఉంటున్నారు.

చంద్రబాబు పాలనలో పంట విరామం

చంద్రబాబు పాలనలో పంట విరామం ఉండేది. కానీ నేడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఆ మాటే రైతుల నుంచి వినపడటంలేదు. పంటకు గిట్టుబాటు ఉండటంతోపాటు దిగుబడులు ఆశాజనకంగా ఉంటున్నాయి. పత్తి, మిర్చి, వరి, మొక్కజొన్న వంటి పంటలకు ఎన్నడూ లేనంత ధర పలకడంతో రైతులు ఆనందంగా ఉన్నారు. గతంలో వ్యవసాయం మానేసిన వారు కూడా చేసే పరిస్థితులు వస్తున్నాయని చెబుతున్నారు. గతేడాది మిర్చి పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.48, 300 చొప్పున క్రాప్ ఇన్సూరెన్స్ అందించి ఆదుకున్న ప్రభుత్వం.. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వమని రైతులు స్పష్టం చేస్తున్నారు.



నాడు పంటవిరామం ప్రకటించడంతో ఖాళీగా ఉన్న మాగాణి భూములు(ఫైల్)



నేడు పంటతో కళకళలాడుతున్న మాగాణి



వైఎస్సార్ యంత్రసేవ ద్వారా ట్రాక్టర్ పంపిణీ



మట్టి నమూనా పరీక్షలు చేస్తున్న ఆర్‌బీకే సిబ్బంది

అందుబాటులో ఆర్బీకేలు



రైతుభరోసా కేంద్రాలు రైతులకు ఉపయోగపడుతున్నాయి. గతంలో పచ్చిరొట్ట విత్తనాలతోపాటు మిగతా వాటికి మండల కేంద్రాలకు పరుగులు పెట్టాల్సి వచ్చేది. కానీ నేడు ఆ పరిస్థితి లేదు. గ్రామంలోనే అందుబాటులో ఉండడంతో రైతులకు కావల్సిన అన్నిసేవలు అందుతున్నాయి.

– పాపిరెడ్డి, రైతు, చిట్టేల

సిఫారసులు లేవు



రైతులకు కావల్సిన విత్తనాలు, ఎరువులు కావాలంటే నాడు సర్పంచులు సిఫారసులు చేసేవారు. కానీ నేడు అటువంటి పరిస్థితులు లేవు. నేరుగా రైతులే గ్రామాల్లో ఉన్న ఆర్బీకేల వద్దకు వెళ్లి వారికి కావల్సిన విత్తనాలు, ఎరువులు తీసుకుంటున్నారు.

– వేమిరెడ్డి వెంకటనారాయణరెడ్డి, కంభంపాడు

క్లుప్తంగా

నరసరావుపేటకు వెళ్లి పింఛన్ అందజేత



వేదాద్రి(జగ్గయ్యపేట): గ్రామానికి చెందిన వలంటీర్ ఔదార్యాన్ని చాటుకుంది. గ్రామానికి చెందిన పిట్టల నాగరాజు అనారోగ్యంతో బాధపడుతూ గుంటూరు జిల్లా నరసరావుపేటలోని నెల్లూరి ఆస్పత్రిలో కొన్ని రోజులుగా చికిత్స పొందుతున్నాడు. గ్రామానికి చెందిన వలంటీర్ గుడారు అనురాధ శనివారం గ్రామంలోని కృష్ణానది ద్వారా పడవలో అవతలి ఒడ్డుకు చేరుకుని అక్కడి నుంచి నరసరావుపేట వెళ్లి పింఛన్ అందించారు. గ్రామస్తులు ఆమెను అభినందించారు.

ఉత్సాహంగా వేసవి శిక్షణ



కంచికచర్ల(వీరులపాడు): గ్రంథాలయాలు మేధస్సును పెంపొందించే నిలయాలని, ఇవి ఉత్సాహంగా జరుగుతున్నాయని గ్రంథాలయాధికారి రామచంద్రుడు పేర్కొన్నారు. కంచికచర్ల శాఖ గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన వేసవి విజ్ఞాన శిబిరంలో శనివారం విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో విద్యార్థులకు విజ్ఞాన శిబిరాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు, చదవడం, క్రీడలు నిర్వహించడంతో మేధోశక్తి పెంపొందుతుందని చెప్పారు. **జగ్గయ్యపేట అర్బన్:** పట్టణంలోని జిల్లా గ్రేడ్-1 స్థాయి గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ఉత్సాహంగా కొనసాగుతోంది. శనివారం విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. ఉపాధ్యాయుడు టి.కృష్ణమూర్తి గణితంలో కూడికలు, తీసివేతలు, హెచ్చవేతలు, భాగించడంపై శిక్షణ ఇచ్చారు. అనంతరం విద్యార్థులకు క్విజ్ పోటీలు జరిగాయి. గ్రంథాలయాధికారి ఎ.ప్రభ, సిబ్బంది రమేష్, సత్యవతి పాల్గొన్నారు.

అన్నదానానికి విరాళం



పెనుగంచిప్రోలు: గ్రామంలోని శ్రీ గోపయ్య సమేత లక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో జరుగుతున్న నిత్యాన్నదానానికి శనివారం రూ.10,200 విరాళం అందించారు. కృష్ణా జిల్లా మచిలీపట్నం గొడుగుపేటకు చెందిన చిలకంటి రామ్మోహనరావు చైతన్యస్రవంతి దంపతులు విరాళాన్ని ఆలయ చైర్మన్ ఇంజం చెన్నకేశవరావుకు అందజేశారు. దాతలకు ఆలయ సిబ్బంది అమ్మవారి జ్ఞాపిక, ప్రసాదాలు అందించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కరుణానిధి సేవలు చిరస్మరణీయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): ద్రవిడ ఉద్యమ నేత, రాజకీయ దురంధరుడు ముత్తవేల్ కరుణానిధి సేవలు చిరస్మరణీయమని ఏపీ నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాయీబ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మల్కాపురం కనకారావు అన్నారు. తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి శత జయంతి సందర్భంగా విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాయీబ్రాహ్మణ సంక్షేమ సంఘం కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కనకారావు మాట్లాడుతూ.. తమిళనాడు రాష్ట్రానికి ఐదుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేసి ప్రజలకు అందించిన సేవలు నిరుపమానమని కొనియాడారు. రాజకీయ నాయకుడిగానే కాకుండా తమిళ చిత్రపరిశ్రమలో రచయితగా, నటుడిగా ప్రజల ప్రశంసలు అందుకున్నారని గుర్తు చేశారు. ద్రవిడ మున్నేట్ర కజగం(డీఎంకే) పార్టీకి ఐదు దశాబ్దాల పాటు వ్యవస్థాపక అధ్యక్షుడిగా ఉన్న ఘనత కరుణానిధిదే అన్నారు. నివాళులర్పించిన వారిలో కార్పొరేషన్ డైరెక్టర్ ప్రకాష్, సంఘ ఉపాధ్యక్షుడు ఆర్.బ్రహ్మేశ్వరరావు, నాయకులు అన్నవరపు బ్రహ్మయ్య, దాలిపర్తి ధన్వంతరి, కాపవరపు నాగ సుధాకర్, పావులూరి రాంప్రసాద్, యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక వైభవానికి పునాది ఆదిశంకరులు

విజయవాడకల్చరల్: భారతీయ ఆధ్యాత్మిక వైభవానికి పునాది జగద్గురువులు ఆదిశంకరులని శృంగేరీ శివగంగ పీఠాధిపతులు పురుషోత్తమ భారతీ మహా స్వామి తెలిపారు. విజయాత్రలో భాగంగా శివరామకృష్ణ క్షేత్రంలో విడిదిచేసిన స్వామి శనివారం భక్తులను ఉద్దేశించి అనుగ్రహభాషణ చేశారు. ఆదిశంకరులు ధర్మరక్షణ కోసం అనేక గ్రంథాలను రచించారన్నారు. వేదాలు, ఇతిహాసాలు, పురాణాలు, సంస్కృతి సంప్రదాయాలు భారతీయ ఆత్మ అని వాటిని కాపాడుకోవాలన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం



జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని 12వ వార్డు విద్యానగర్, 6వ వార్డులో సుమారు రూ.22 లక్షల వ్యయ అంచనాతో నిర్మిస్తున్న పలు అభివృద్ధి పనులకు మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర శనివారం శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను చేపట్టిన ప్రణాళిక ప్రకారం పట్టణాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళుతున్నామన్నారు. గడప గడపకు మన ప్రభుత్వంలో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు రోడ్డు, పైపులైన్, కల్వర్టు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. వీలైనంత త్వరగా నిర్మించి అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ తుమ్మల ప్రభాకర్, కౌన్సిలర్ వట్టెం మనోహర్, కోఆప్షన్ సభ్యుడు షేక్ ఖాదర్ బాబు, మున్సిపల్ కమిషనర్ సీహెచ్ మల్లేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

లలితాంబికా పీఠంలో అభిషేకాలు



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): పౌర్ణమి పురస్కరించుకుని పాలప్రాజెక్టు సమీపంలోని లలితాంబికా పీఠంలోని వారాహి అమ్మవారికి శనివారం పంచామృత అభిషేకాలు నిర్వహించారు. శనివారం సాయంత్రం పీఠం ఆవరణలోని వారాహి మాతకు పీఠాధిపతి శివలీల మాతాశ్రీ పంచామృతాలతో అభిషేకాలు జరిపారు. అనంతరం విశేష అలంకరణ, పూజ, కుంకుమార్చనలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో పలువురు ఉభయ దాతలు, భక్తులు పాల్గొనగా, పూజ అనంతరం తీర్థప్రసాదాల వితరణ జరిగింది. పూజలను పీఠం కన్వీనర్ చైతన్య పర్యవేక్షించారు. ప్రతి పౌర్ణమికి అమ్మవారికి అభిషేకాలు నిర్వహిస్తున్నట్లు శివలీల మాతాశ్రీ పేర్కొన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

నందిగామ: పట్టణ పరిధిలో ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం తెలిపారు. 1వ వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను శనివారం ఆయన పరిశీలించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పారిశుద్ధ్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ నగర పంచాయతీ పరిధిలో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దోమల నివారణకు చర్యలు తీసుకోవడం, నిల్వ ఉన్న నీటిలో ఆయిల్ బాల్స్, ఎబేట్ లాంటివి పిచికారి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వార్డ్ కౌన్సిలర్ పాకాల పాటి కిరణ్, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ గురునాథం, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



1వ వార్డులో పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్న కమిషనర్ జయరాం

కోనేరు వద్ద ఆక్రమణ తొలగింపు

నందిగామ: పట్టణంలో కోనేరు వద్ద నిర్మించిన ఆక్రమణను శనివారం సాయంత్రం రెవెన్యూ, దేవదాయ శాఖ అధికారులు తొలగించారు. తహసీల్దార్ నరసింహారావు తెలిపిన సమాచారం ప్రకారం పట్టణంలోని రామలింగేశ్వరస్వామి ఆలయానికి చెందిన కోనేరు.. పాత బస్టాండ్ సమీపంలో ఉంది. దాని ఒడ్డు న కొంత ప్రాంతం ఆక్రమణలకు గురైంది. కోనేరుకు ఆగ్నేయాన పురాతన శివాలయం ఉంది. అది శిథిలావస్థకు చేరుకుంది. దాని సమీపంలో మరుగుదొడ్డి ఏర్పాటు చేయడంతో దేవదాయ శాఖ అధికారులు దానిని ఏర్పాటు చేసిన వారికి తొలగించాలని గతంలో ఆదేశించారు. అయినా తొలగించక పోవడంతో శనివారం సాయంత్రం రెవెన్యూ, దేవదాయ శాఖ అధికారులు క్రేన్ సాయంతో మరుగుదొడ్డిని తొలగించారు.



ఆక్రమణలు తొలగిస్తున్న అధికారులు

సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాల నిర్వహణలో భాగస్వాములు కావాలని, పేద వారికి సాయం చేయడం ద్వారా ఎంతో సంతృప్తినిస్తుందని వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు పేర్కొన్నారు. దుర్గాభవాని చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పౌర్ణమిని పురస్కరించుకుని శనివారం పలువురికి అన్నప్రసాద వితరణ జరిగింది. కొత్తపేట ఆంజనేయ వాగు సెంటర్‌లోని ట్రస్ట్ కార్యాలయం వద్ద అన్నప్రసాద వితరణను ఎమ్మెల్యే వెలంపల్లి ప్రారంభించారు.

తొలుత మహా శివుని విగ్రహానికి అర్చకులు వినుకొండ శ్రీనివాసరావుశర్మ పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణను ప్రారంభించారు. వెయ్యి మందికి అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. ప్రతి మాసంలో వచ్చే పౌర్ణమి రోజున అన్నప్రసాద వితరణ చేస్తామని ట్రస్ట్ నిర్వహకుడు పిళ్లా దుర్గారావు పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు ప్రేమ్‌కుమార్, నందే కిశోర్, ఠాగూర్, నక్కా ప్రభుదాస్, మునిశెట్టి లోకేష్ రెడ్డి, కొరగంజి శ్రీను, గూడెల రామారావు, బాయన కృష్ణ, అజారుద్దీన్, ఆర్.శ్రీను పాల్గొన్నారు.



అన్నప్రసాదాన్ని అందజేస్తున్న వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు వెలంపల్లి

నేటి నుంచి ద్వాదశ బ్రహ్మోత్సవాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): శ్రీపద్మావతి గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వార్ల దేవస్థాన ద్వాదశ బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామని ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు లింగిపిల్లి అప్పారావు, మరుపిళ్ల హనుమంతరావు పేర్కొన్నారు. చిట్టినగర్‌లోని శ్రీ మహాలక్ష్మి అమ్మవారి దేవస్థాన ఆస్థాన కల్యాణ మండపంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను కమిటీ ప్రతినిధులు వివరించారు. ఆదివారం నుంచి ప్రారంభమయ్యే బ్రహ్మోత్సవాలు 8వ తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయన్నారు. బ్రహ్మోత్సవాల్లో నగరానికి చెందిన పలువురు ప్రముఖులు, రాజకీయ నాయకులు, అధికారులు పాల్గొంటారని చెప్పారు. ఆదివారం ఉదయం సహస్ర కలశ యాత్రతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మండపంలో యాగశాల, ఆలయం వెలుపుల చలువ పందిళ్లు, ప్రత్యేకంగా క్యూలైన్లు ఏర్పాటు చేశామన్నారు. బ్రహ్మోత్సవాల కరపత్రాలను కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని ఉత్సవాలను విజయవంతం కావాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ గౌరవ అధ్యక్షుడు బెవర సూర్యనారాయణ, కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావు, కమిటీ ఉపాధ్యక్షులు మరుపిళ్ల సత్యనారాయణ, బెవర శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



బ్రహ్మోత్సవాల కరపత్రాలను విడుదల చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

నేడు ఉచిత మెగా వైద్యశిబిరం

ఆటోనగర్(విజయవాడతూర్పు): కొమ్మారెడ్డి బ్రహ్మానందరెడ్డి (భూమిపుత్ర) ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు బ్రహ్మానందరెడ్డి తెలిపారు. పటమటలోని గణపతి సచ్చిదానంద ఆశ్రమం రోడ్డులోని రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా కార్యాలయం ఆవరణలో వైద్యశిబిరం జరుగుతుందన్నారు. ఈ శిబిరంలో ఆర్థోపెడిక్, జనరల్ ఫిజీషియన్, డెంటల్, కార్డియాలజిస్ట్ సంబంధిత వ్యాధులకు వైద్యులు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తారన్నారు. ఈ అవకాశాన్ని నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నదీ జలాలు కలుషితం కాకుండా చూడాలి



లబ్బీపేట(విజయవాడతూర్పు): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు, నదీ జలాలను కలుషితం కాకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని నలంద డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనూరాధ అన్నారు. నలంద డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లు పునీత్‌సాగర్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం కృష్ణానదిలో కృష్ణవేణి ఘాట్ వద్ద పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ అనూరాధ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. కాలుష్యం వలన పర్యావరణ సమతుల్యం దెబ్బతింటుందని, వాతావరణ మార్పులు సంభవిస్తాయని చెప్పారు. గాలి, నీరు, నేల కలుషితం కాకుండా చూడాలన్నారు. నదీ జలాల కాలుష్యం వలన దిగువ ప్రాంత ప్రజలు ఆ నీటిని తాగడంతో వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. నదుల్లో చెత్త వేయవద్దని సూచించారు. లెఫ్టినెంట్ ఏఎన్‌ఓ షేక్ రఫియాబేగం, క్యాడెట్లు పాల్గొన్నారు.

గిరిజనుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

కంచికచర్ల(వీరులపాడు): గిరిజనుల సంక్షేమానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని ఎంపీడీవో బాలశంకరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు వేల్పుల ప్రశాంతి పేర్కొన్నారు. కీసర గ్రామానికి చెందిన 25 చెంచు కుటుంబాలకు ప్రభుత్వం మంజూరు చేసిన టార్పాలిన్ పట్టాలను జిల్లా గిరిజన సంక్షేమాధికారి రుక్మానందయ్యతో కలిసి శనివారం పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ ఒక్కో పట్టా రూ. మూడు వేల విలువ ఉంటుందన్నారు. గుడిసెల్లో ఉంటున్న చెంచు కుటుంబాలు వర్షాకాలంలో పలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. విషయం తెలుసుకున్న కలెక్టర్ ఢిల్లీరావు పట్టాల పంపిణీకి చర్యలు తీసుకున్నారని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ శంకర్‌బాబు, సర్పంచ్ లక్ష్మీనరసమ్మ, ఎంపీటీసీ సభ్యుడు పాపట్ల స్వామి, నాయకులు పరిటాల రామకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



టార్పాలిన్లు పంపిణీ చేస్తున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు

ముస్లింల పక్షపాతి సీఎం జగన్

జగ్గయ్యపేట అర్బన్: ముస్లింల పక్షపాతి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని ముస్లింలు కొనియాడారు. శనివారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ముస్లిం మైనార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ మొహిద్దీన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కృతజ్ఞతా కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ముస్లింలు పాల్గొని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో ఇప్పటి వరకు ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ముస్లింలు హజ్ యాత్రకు వెళ్లేందుకు సహాయ సహకారాలు అందజేయడం హర్షణీయమన్నారు. ఇప్పటి వరకు రాష్ట్రం నుంచి హజ్ యాత్రకు వెళ్లాలంటే హైదరాబాద్, బెంగుళూరు వంటి నగరాల నుంచి వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. దీన్ని సులభతరం చేయడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వంతో అనేకసార్లు చర్చలు జరిపారన్నారు. మొట్టమొదటి సారిగా మన రాష్ట్రం నుంచి ఈనెల 7వ తేదీ ముస్లింలు హజ్ యాత్రకు గన్నవరం ఎయిర్‌పోర్ట్ నుంచి వెళ్లే విధంగా ఏర్పాటుచేశారన్నారు. అంతేకాకుండా హజ్ యాత్రకు వెళ్లే ముస్లింలపై అదనపు భారం పడకుండా ఒక్కొక్కరికి రూ.80 వేల ఆర్థిక సాయం అందజేస్తున్నారని, రాష్ట్రవ్యాప్తంగా రూ 14.15 కోట్లు విడుదల చేసి మరొకసారి ముస్లింల పక్షపాతిగా నిరూపించుకున్నారని తెలిపారు. మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, నియోజకవర్గ మైనార్టీ అధ్యక్షుడు రస్ హుస్సేన్, పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ మొహిద్దీన్, దర్గా కమిటీ అధ్యక్షుడు షేక్ ఖాజా, తదతరులు పాల్గొన్నారు.



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ముస్లింలు, మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర

భానుడి భగభగలు

నందిగామ: మండుటెండకు తోడు వడగాల్పులు కూడా ప్రారంభమయ్యాయి. శనివారం నందిగామ ప్రాంతంలో భానుడు మరింత ప్రతాపం చూపాడు. పగటి ఉష్ణోగ్రతలు 44.1 నమోదవ్వగా రాత్రి ఉష్ణోగ్రతలు సైతం 29.3 డిగ్రీలు నమోదయ్యాయి. ఈ ఏడాది ఇప్పటివరకు నందిగామ లో అత్యధిక పగటి ఉష్ణోగ్రత ఇదేనని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. వడగాల్పులకు ప్రజలకు బయటకు రావాలంటే భయపడ్డారు. నిత్యం రద్దీగా ఉండే నందిగామలోని పలు ప్రధాన వీధులు సాయంత్రం కూడా నిర్మానుష్యంగా కనిపించాయి.



పెనుగంచిప్రోలు యాత్రికుల మధ్య వివాదం

ఇబ్రహీంపట్నం: పెనుగంచిప్రోలు నుంచి బస్సుల్లో వస్తున్న యాత్రికులు, ఇబ్రహీంపట్నానికి చెందిన యువకుల మధ్య శుక్రవారం రాత్రి వివాదం జరిగింది. జూపూడిలో జరిగిన ఘటనలో 8మంది యువకులపై 200మంది యాత్రికులు దాడి చేశారు. సేకరించిన వివరాల ప్రకారం ఇబ్రహీంపట్నంకు చెందిన 8మంది యువకులు పెనుగంచిప్రోలు తిరుపతమ్మ దర్శనానికి రెండు కార్లలో వెళ్లారు. వారికి గుంటూరు జిల్లా ఫిరంగిపురం నుంచి మూడు బస్సుల్లో వచ్చిన 200మంది యాత్రికుల మధ్య పాటల పెట్టే క్రమంలో వివాదం ముదిరింది. వారు ఆ యువకులపై దాడిచేశారు. తిరుగు ప్రయాణంలో బస్సులతో పాటు వచ్చిన యువకులు ఇబ్రహీంపట్నం సమీపంలో జూపూడి వద్ద బస్సులు ఆపి మాపై ఎందుకు దాడిచేశారని ప్రశ్నించారు. మళ్లీ వివాదం ముదిరి 200మంది గుంటూరు భక్తులు యువకులను చితకబాదారు. పోలీసులు ఇరువర్గాలను స్టేషన్‌కు తరలించారు. ఇరువర్గాలు రాజీ పడటంతో ఫిర్యాదు అందలేదు.

రైలు ప్రమాద మృతులకు నివాళులు

నందిగామ: ఒడిశా రాష్ట్రంలో శుక్రవారం రాత్రి జరిగిన రైలు ప్రమాదంలో మృతిచెందిన వారికి బీజేపీ స్థానిక నాయకుల ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం నివాళులర్పించారు. పట్టణంలోని శివాలయం సెంటర్ లో కొవ్వొత్తులు వెలిగించి మృతులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో నేతలు సీతారామయ్య, కేదార్‌నాథ్‌శర్మ, అశోక్, లక్ష్మణ, కొండ తదితరులు పాల్గొన్నారు.